
4

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- నిఘా నీడలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర
- 350 మంది పోలీసులతో బందోబస్తు..
- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ కుమార్ దీపక్


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం । 5 సెప్టెంబర్ 2025 । ■ 13 పేజీలు



13

- మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగు పర్చేందుకు ప్రతిపాదనలు
- అధికారులతో కలిసి సాధ్యసాధ్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

# వాగులపై ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

వర్షాకాలం వస్తే వాగులు, వంకలు పొంగి మారుమూల అటవీ గ్రామాలకు బాహ్య ప్రపంచం తో సంబంధాలు తెగిపోతున్నాయి. అసలే రోడ్డు సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజలు వాగులు పొంగడంతో నెలల పాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులు పొంగడంతో అత్యవసర సమయాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణీ స్త్రీలు ఆస్పత్రులకు వెళ్లేందుకు సహసమే చేయాల్సి వస్తుంది. టైగర్ జోన్ కావడంతో రోడ్లు, వంతెనలు నిర్మిచేందుకు అటవీ అనుమతులు పొందడంగగనమైపోయింది. వాగుల పై వంతెనలు నిర్మించడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్న అటవీ శాఖ ససేమిరా అంటుండం తో దశబ్దాలుగా అడవులే ఆటపట్టుగా మనుగడ సాగిస్తున్న అడవి బిడ్డల బతుకులు దుర్భరమైపోతున్నాయి. ఈ సమస్యలు పరిష్కరించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ప్రత్యేక దృష్టి సారించారు. వాగుల పై ఐరన్ బ్రిడ్జిలు నిర్మించే ఆలోచన చేసారు. ఆలోచన వచ్చిందే తడువుగా గురువారం అధికారులను వెంటబెట్టుకొని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి మారుమూల గ్రామాల్లో పర్యటించారు.ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని తీర్యాని మండలం గడెలపల్లి గ్రామపంచాయితీలోని అటవీ ప్రాంతంలో వాగు మీద నిర్మించిన ఐరన్ బ్రిడ్జిని ఆయన పరిశీలించారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురసరించుకొని గురువారం ఆదిలాబాద్ జడ్పీ హాల్‌లో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఐటీడీఏ పీవో, జిల్లా ఇన్‌చార్జి డీఈవో ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన 72 మంది ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లతోపాటు మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్ర, సెక్టోరియల్ అధికారులు రఘు రమణ, ఉదయశ్రీ, సుజాత్ అలీ తదితరులు పాల్గొన్నారు. 10లో

### ముగ్గురిని రక్షించి

## మృత్యువాత

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మల్లంగి గ్రామానికి చెందిన శంకర్, కృష్ణ, మిథున్, మిట్టు వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో పెద్దవాగులో చిక్కుకున్నారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఈ ముగ్గురిని శంకర్ వాగు దాటించాడు. ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో శంకర్ వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు.




2

## నిమజ్జనం.. శోభాయమానం

- బైంసాలో గణనాథుడికి భక్తుల వీడ్కోలు
- ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం..
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు..

'గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా..' 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అనే నినాదాలతో బైంసా పురవీధులు మారుమోగాయి. నవరాత్రులు విశేష పూజలు అందుకున్న గణనాథులు గురువారం నిమజ్జనానికి తరలాయి. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు.



## గురుదేవోభవ!

■ సామాన్య ఉపాధ్యాయుడి నుండి రాష్ట్రపతిగా రాధాక్రిష్ణన్ ■ భావి, భారత పౌరులను తీర్చిదిద్దే ■ కీలక బాధ్యత గురువులదే ■ గురు భావనకు విశిష్ట స్థానం ■ మారుతున్న కాలంలో ఉపాధ్యాయుడిగా గురుస్థానం ■ బోధనలో సరికొత్త పద్ధతులు.. సాంకేతికతకు ప్రాధాన్యత ■ నేడు ఉపాధ్యాయ దినోత్సవం - 5లో







# నిమజ్జనం.. శోభాయమానం

- భైంసాలో గణనాథుడికి భక్తుల ఘన వీడ్కోలు
- ప్రశాంత వాతావరణంలో భైంసా గణేష్ నిమజ్జన వేడుకలు...
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు
- అడుగడుగునా భారీ బందోబస్తు
- ఆకట్టుకున్న నిమజ్జనం..
- బందో బస్తును పర్యవేక్షించిన ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ

**'గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా..' 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అనే నినాదాలతో భైంసా పురవీధులు మారుమోగాయి. నవరాత్రులు విశేష పూజలు అందుకున్న గణనాథులు గురువారం నిమజ్జనానికి తరలాయి. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, యువకుల కేరింతలు, చిందుల మధ్య శోభాయాత్ర కొనసాగింది. గడ్డెన్న, సుద్దవాగుల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా.. వినాయక సెలవిక అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ, ఏఎస్పీల ఆధ్వర్యంలో 600 మంది పోలీసులతో పకడ్బందీ బందోబస్తు నిర్వహించారు.**

**ముథోల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో గురువారం ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన వేడుకలు జరుపుకున్నారు. స్థానిక భైంసా పట్టణంలోని బట్టిగల్లి గణేష్నగర్ మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిమజ్జన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్,హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.గణేష్ ఉత్సవాలను శాంతి యుత వాతావరణంలో జరుపుకొని పండుగ సామరస్యాన్ని పెంచాలని, భైంసా ఉత్సవాలపై హైదరాబాదులు సైతం ఎలా జరుగుతున్నాయని, అక్కడి వరకు భైంసా పేరు వ్యాపించిందని అన్నారు. ఇక్కడి ఉత్సవాలు హైదరాబాది లు సైతం ఇష్టపడతారన్నారు.

**భారీ బందోబస్తును ఏర్పాటు చేసిన ఎస్పీ జానకి షర్మిల...**
భైంసా గణేష్ నిమజ్జనం వేడుకలకు అధికారుల అన్ని రకాల ఏర్పాట్ల నడుమ కొనసాగగా,అన్ని శాఖలు ఏర్పాట్లను సర్వ సిద్ధం చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేతిక కుమార్ ప్రత్యేకంగా నిమజ్జనం వేడుకల పై నిఘా ఉంచారు. గత సంఘటనలు దృష్టిలో ఉంచుకొని భైంసా సున్నిత ప్రాంతం కావడంతో భారీ బందోబస్తును జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఏర్పాటు చేశారు. ఒక ఎస్.పి నీ, ఇద్దరు ఏఎస్పీ లను,12 మంది సి.ఐలను,20 మంది ఎస్.ఐలను, దాదాపు 600 పి.సి లను,120 ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల మానిటర్ రింగ్ రూంలో ప్రతి సంఘటన కదలికలను ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. 30 రూఫ్ టాప్లను ఏర్పాటు చేశారు. మరోపక్క మున్సిపల్ అధికారులు స్థానిక గడ్డన్న వాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జనానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసి, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.విద్యుత్ అధికారులు సైతం గత తప్పిదాలను దృష్టిలో పెట్టుకొని విధులలో చిత్తశుద్ధి ప్రదర్శించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

**గడ్డెన్న వాగు వద్ద నిమజ్జన వేడుకలు..**
పట్టణంలోని దాదాపు 120 నుంచి 130 గణేశుల నిమజ్జనాన్ని స్థానిక పట్టణంలోని గడ్డన్న వాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. భారీ వినాయక విగ్రహాలను క్రేన్ల సహాయంతో నిమజ్జనం కూడా సాగించగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు,హెల్త్ సిబ్బంది సైతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. నిమజ్జనం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

**ఆకట్టుకున్న హత్తి గణేష్ నిమజ్జనం...**
దాదాపు స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటికీ 105 సంవత్సరాలుగా ఉత్సవాలను కొనసాగిస్తున్న నాయి బ్రాహ్మణులు, నిమజ్జనాన్ని హత్తి ఏనుగు పై నిర్వహిస్తు తమ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. వేడుకలు ప్రత్యేకంగా నిలిచాయి.









# విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి

**శ్రద్ధతో చదివి ఉన్నత స్థానంలో నిలవాలి**
**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**





**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసి స్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను గురువారం సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యత, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. వంట మనుషులతో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు తెలుసుకున్నారు. వంట సమయంలో శుభ్రత పాటిం చాలని, భోజనానికి తాజా కూరగాయలు, నిత్యావసర సరుకలను వినియోగించాలన్నారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయుల స్థానంలో బోధించిన తీరును పరిశీలించారు. విద్యార్థులను గణితం నుంచి ప్రశ్నలు అడిగి వారి అభ్యాసాన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# సాహసం చేసి.. ప్రాణాలు కాపాడి

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి మండలంలో బుధవారం కురిసిన వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. సట్వాజీగూడ సమీపంలోని వాగు పొంగి ప్రవహిస్తున్న సమయంలో బుర్సానటార్కు చెందిన ఆటో డ్రైవర్ నిఖిల్ ఆటోను అందులో నుంచి తీసుకెళ్తుండగా అకస్మాత్తుగా ప్రవాహం పెరిగి కొట్టుకుపోయింది. విషయాన్ని గమనించిన ఎస్సై సాయన్న తాళ్ల సహాయంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిని, డ్రైవర్, ఆటోను బయటకు తీశారు. ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు కాగా, వారిని పీహెచ్సీకి తరలించారు. ప్రాణాలను లెక్కచేయకుండా కాపాడిన ఎస్సై, పోలీసులు, పంచాయతీ సిబ్బందిని పలువురు అభినందించారు. మండలంలో 42.22 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వడ్గం, వాల్గొండ, హీరాపూర్, జైత్రంతండా రహదారులపై 2గంటలు రాకపోకలు నిలిచాయి.

## మద్యం సేవించి వాహనాలు

# నడిపితే కేసులు నమోదు

**నార్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టారిత్యా చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని నార్నూర్ ఎస్సై అఖిల్ హెచ్చరించారు.ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వ హించారు. ప్రధాన రహదారిపై వెళ్లే ప్రతి వాహనాన్ని తని ఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. పెండింగ్ ఫైన్లను చెల్లించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, వాహనాలకు అవసరమైన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని వాహన చోదకులకు సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# సాధ్యం కానీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

**- ఆరు గ్యారంటీల అమలేది? - యూరియా కొరత తీర్చేదేన్నడు - బీజేపీ నాయకుడు రఘునాథ్**

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు రైతులకు యూరియా కొరత ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా చెన్నూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు లేని యూరియా కొరత మంచిర్యాల నియోజకవర్గంలోని మండలాలకు ఎందుకు వచ్చిందో రైతులు అర్థం చేసుకోవాలని సూచించారు. మంత్రి వివేక్ వెంకట స్వామి వలన ఆ చెన్నూర్ నియోజకవర్గానికి ఎక్కువ యూరియా బస్తాలు వచ్చాయని, ఇక్కడి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్



రావు ముందే స్పందించి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని విమర్శించారు. అంతేకాకుండా కల్యాణ లక్ష్మీ, తులం బంగారం, ప్రతినెల మహిళలకు ఆర్థిక సహకారం, వితంతువుల, దివ్యాంగుల పెన్షన్, విద్యార్థులకు నిరుద్యోగ భృతి, స్కూటీలు, జాబ్ క్యాలెండరు లాంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అంతకుముందు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు ముత్తే సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళబొల్లి మాటలతో ప్రజలను మభ్య పెడుతోందన్నారు. రైతులకు యూరియా లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రైతులతో పాటు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంతకుముందు పట్టణంలోని పలు వీధుల గుండా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీసి హామీలు అమలు చేయా లని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు హరి గోపాల్, హేమంత్ రెడ్డి, స్వామి రెడ్డి, రమేష్ జైన్, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదామును
# తనిఖీ చేసిన కలెక్టర్

**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లాలోని నస్పూర్‌లోని ఈ.వి.ఎం. గోదామును జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గోదాము వద్ద భద్రత సిబ్బందితో పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సి.సి.కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రామచందర్, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయన కళ్లకు మరణం లేదు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**



బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన డోలి కృష్ణమూర్తి గురువారం మృతి చెందారు. దీంతో జనహిత సభ్యులు సుకుమార్ వారి కుటుంబ సభ్య లను నేత్రదానం కోసం అంగీకరించేలా చేశారు. దీంతో కృష్ణమూర్తి భార్య పుష్ప, కుమారులు నాగేంద్ర ప్రసాద్, సాయి కృష్ణ తమ తండ్రి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశియా ఫౌండేషన్ సహకారంతో వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రలను స్వీకరించారు. నేత్రదానం చేసిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు జనత సేవా సమితి అధ్యక్షులు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

# డీఈఓను కలిసిన ట్రాస్మా సంఘం సభ్యులు

**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా విద్యాధికారిగా నూతనంగా నియ మితులైన దర్శనం భోజన్నను నిర్మల్ జిల్లా ట్రాస్మా సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మర్యాదపూ ర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సమావేశంలో ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నిర్మల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అబ్బాస్, నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్, టౌన్ సెక్రటరీ శ్యామ్, నిర్మల్ జిల్లా ట్రస్మా సభ్యులు ఎల్లయ్య, జయరాజ్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.



## సొంతింటి కల సాకారానికి
# సీఐటీయూ వినూత్న కార్యక్రమం



**మందమర్రి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

సింగరేణి కార్మికులు సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న సొంతింటి కల సాకారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న వినూత్న కార్యక్రమాలలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ నాగరాజు గోపాల్, బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్‌లు కోరారు. ఏరియాలోని కాసిపేట 2-గనిపై గురువారం నిర్వహించిన సమావేశంలో సింగరేణి సంస్థ గత 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలలో కార్మికుల లాభాల వాటాపై ప్రకటన చేయాలని, కార్మికుల మారుపేర్లను సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న జిఎం కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం కోసం ఈనెల 11, 12 తేదీలలో గనులు డిపార్ట్ మెంట్ల వారిగా ఓటింగ్ నిర్వహించి కార్మికుల అభిప్రాయాన్ని తెలుసుకొని కార్మికుల అభిప్రాయాలకు అనుగుణంగా ఆందోళన కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కళ నెరవేరుస్తామని సింగరేణి ఎన్నికల్లో అన్ని యూనియన్లు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తరువాత కార్మికుల సొంతింటి కళపై అసెంబ్లీలో మాట్లాడకుండా దాటవేస్తున్న కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేల తీరు సరికాదనీ వారు మండిపడ్డారు. సింగరేణి లో గుర్తింపు సంఘం సొంతింటి కళ పై కమిటీ వేసిందని చెబుతూనే ప్రభుత్వం చేతిలో ఉందని రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తుందని వారు విమర్శించారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు సొంతింటి కళ నెరవేర్చడం వలన క్వార్టర్ల పై ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదని, ప్రభుత్వానికి పన్నులు కట్టడం తప్పుతుందని, 2011 లో అగ్రిమెంట్ చేసుకుని అధికారులకు అమలు చేస్తున్న అలవెన్స్ లపై ఐటి మాఫీ ఒప్పందాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉండదని, వీటివలన యాజమాన్యానికి ఆర్థికంగా లబ్ధి జరుగుతుందన్నారు. సొంతింటి కళకై చేస్తున్న పోరాటంలో గని సీనియర్ కార్మికుడు డి గోపాలకృష్ణ యూనియన్‌లో చేరగా ఆయనను కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ బుద్ధ సురేష్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ధనిశెట్టి సురేష్, షిఫ్ట్ ఇంచార్జ్ సురేష్, ఆర్గనైజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.



## మైనార్టీ, సంక్షేమ బాలికల
# కళాశాలలో వైద్య శిబిరం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మైనార్టీ గురుకులం, బాలికల సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి 15 మందిని జ్వర పీడితులుగా గుర్తించి ఆర్డి పరీక్షలు చేయగా ఎలాంటి పాజిటివ్ కేసులు నిర్ధారణ కాలేదు. చర్మ సంబంధిత సమస్యతో బాధపడుతున్న 8 మంది, కంటి సమస్యతో బాధపడుతున్న ఇద్దరితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మరో 24 మందిని గుర్తించి మందులు అందించారు. అనంతరం కళాశాల గదిలలో దోమల మందులు పిచికారి చేశారు. కళాశాలలో మరో మూడు రోజులు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుచరిత, ఆర్.బి.ఎస్.కె సిబ్బంది, డిపిహెచ్ఎన్ పద్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తెలిపారు.

# పంటల సాగుపై అవగాహన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

భీమిని మండలం వెంకట పూర్ గ్రామంలో గురువారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్. యూ. స్రవంతి ఆధ్వర్యంలో బీర సాగులో సమగ్ర పంట యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో సాగు, అధిక వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వివిధ పంటల్లో తెగుళ్ళ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం భీమిని గ్రామంలో బీర, వంకాయ, బెండ, చిక్కుడు తోటలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. రైతులు పలు పంటలపై సాగు సందేహాలను అడిగి సలహాలను పొందారు. ఈ కార్యక్రమంలో భీమిని మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్, రైతులు పాల్గొన్నారు.



# పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

## మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు

**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలనీ మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు ఆధ్యాత్మికంగా, శాంతి యుత మార్గంలో నిర్వహించుకోవాలన్నారు. ఐక్యతతో అన్ని వర్గాల ప్రజలు వినాయక చవితి నవరాత్రోత్సవాలను, నిమజ్జనోత్సవాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

**సామాజిక సేవలో తమవంతుగా...**

ఈ సందర్భంగా అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ రవి మాట్లాడుతూ, సామాజిక సేవలో తమవంతు బాధ్యతగా ఆంజనీ పుత్ర సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం డైరెక్టర్ లు, స్థానిక సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు


- నిఘా నీడలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర
- బందోబస్తులో 350 మంది పోలీసు సిబ్బంది
- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీపీ, కలెక్టర్
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో వినాయక నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిఘా నీడలో శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. గురువారం జిల్లాలోని తాండూర్, మంచిర్యాల, ఇందారం వద్ద గల గోదావరి బ్రిడ్జ్, గోదావరి తీరం వెంట నిమజ్జనం జరిగే ప్రదేశాలను, శోభయాత్ర రూట్ ప్రదేశాలను కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు.

**బందోబస్తుకు పోలీసులు...**
మంచిర్యాల జిల్లాలో భక్తులు 2,334 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, వీటి నిమజ్జనం, శోభయాత్రకు అన్ని ఏర్పాట్లు చేశామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బందోబస్తు కోసం ముగ్గురు ఏసీపీలు, 11 మంది సీఐ, ఆర్ఐలు, 28 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, 175 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్ల, 65 మంది హోంగార్డులు, 30 మంది ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, 40 మంది ట్రాఫిక్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, క్యాడెట్లు ఉంటారన్నారు. నిమజ్జన శోభాయాత్రను డ్రోన్ కెమెరా సహాయంతో పర్యవేక్షిస్తామని, ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఎదురైతే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

**నిమజ్జన ప్రాంతాలు ఇవే...**
జిల్లాలో వినాయక నిమజ్జనాలకు సంబంధించి పాయింట్లను గుర్తించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కువగా విగ్రహాలు దండేపల్లి మండలం గూడెం – రాయపట్నం బ్రిడ్జి వద్దకు వెళతాయని, అలాగే లక్షెట్టిపేట గోదావరి పుష్కర ఘాట్, మంచిర్యాల గౌతమేశ్వర ఆలయం, సీతారాంపల్లి ఇంటెక్ వెల్, ఇందారం గోదావరి బ్రిడ్జి, చెన్నూర్ పెద్ద చెరువు, బెల్లంపల్లి పోచమ్మ చెరువుల్లో పెద్ద మొత్తంలో వినాయక నిమజ్జనం జరుగుతుందని, ఆయా ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు పికెట్లు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మత్తు, ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, ఫ్లాట్ ఫామ్స్, మంచినీటి వసతి ఏర్పాటు చేశామని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్ల అందుబాటులో ఉంటారన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు త్వరిత గతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని సూచించారు. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. ఊరేగింపులో




డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని మత సామరస్యంతో, శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.



# లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 100 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ముగిసే సమయం ఆసన్నమైందని లబ్ధిదారులు మంచి రోజు చూసుకొని పనులు మొదలు పెట్టాలని, 45 రోజుల్లోపు పనులు మొదలుపెట్టని వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు. నాలుగు విడతలుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు పడతాయని, ప్రతి లబ్ధిదారునికి నిధులు వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా ఈ పథకాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, భాజపా మండల అధ్యక్షులు అశోక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రవీందర్, దీపక్ గైన్, వేణు, కార్తీక్, రావుల నరేష్, సుమిత్ర, పెంటయ్య, విలాస్, విజయ్, సుధాకర్, హన్మంతు, రాములు పాల్గొన్నారు.



## బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
నర్సాపూర్ మండలం కుస్లి గ్రామం నుండి ప్రేమ్‌నగర్ తండా వరకు రూ.1 కోటి 20 లక్షల నిధులతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మారుమూల తండాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను, రోడ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించి రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, ముత్యం రెడ్డి, మండల అధ్యక్షులు నరేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కోలేటి శివప్రసాద్


**మందమర్రి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**



బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యులుగా పట్టణానికి చెందిన కోలేటి శివప్రసాద్‌ను నియమిస్తూ బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించిన జిల్లా అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తూనే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ

**దండేపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
దండేపల్లి మండలంలోని టీడబ్ల్యూపిఎస్ కుంటలగూడ రాజుగూడ పాఠశాలలను గురువారం గౌరవ అకడమిక్ మానిటరింగ్ అధికారి సిహెచ్ లక్ష్మణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు వారి నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా పాఠాలు చెప్పారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అకడమిక్ కార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జన్నారం కాంప్లెక్స్ ఎస్‌సిఆర్‌పి రఘునాథం పాల్గొన్నారు.



# సోమగూడెంలో రజకుడి షెడ్డు కూల్చివేత

**కాసిపేట, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
సింగరేణి మందమర్రి ఏరియాలోని సోమగూడెం భరత్ కాలనీ చౌరస్తాలో రజకుడిపై సింగరేణి ఎస్‌అండ్ పీసీ సిబ్బంది తమ ప్రతాపాన్ని చూపించారు. కంచర్ల రాజమల్లు అనే వ్యక్తి కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. అతడికి సోమగూడెం చౌరస్తాలో తడకలతో నిర్మించిన షెడ్డు ఉండగా.. ఇటీవలే దానిని రేకులతో తాత్కాలిక షెడ్డుగా నిర్మించే పనులు చేపట్టాడు. అయితే.. సింగరేణి ఎస్ అండ్ పీసీ సిబ్బంది వచ్చి ఇక్కడ నిర్మాణం చేపట్టవద్దంటూ రాజమల్లు షెడ్డును ధ్వంసం చేశారు. ‘కుల వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నానని. నా పొట్ట కొట్టవద్ద’ని వేడకున్నా సిబ్బంది కనికరించలేదు. దాంతో.. బాధితుడు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. పేదవాడైనా అతడిపై ప్రతాపం చూపించిన అధికారులు.. చుట్టు పక్కల అక్రమంగా పెద్ద కట్టడాలు కట్టినా మౌనంగా ఉండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 30 ఏళ్ల నుంచి ఆ చిన్నపాటి లాండ్రీ షాప్‌పైనే ఆధారపడి జీవిస్తున్న రాజమల్లు షెడ్డును కూల్చివేయడాన్ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యాక్షులు చందర్ ఖండించారు. సింగరేణి యాజమాన్యం



వైఖరిని తప్పుపట్టిన ఆయన రాజమల్లుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రజకులంతా ఆందోళన బాట పడుతామని ఆయన హెచ్చరించారు.

# గూగుల్ కన్నా - గురువే మిన్న..

## గురువు - సమాజ నిర్మాణకర్త..



**భారతదేశ చరిత్రలో, సంస్కృతిలో, సంప్రదాయాలలో గురువుల స్థానానికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో, సమాజానికి విలువలను బోధించడంలో, దేశనిర్మాణంలో కీలక పాత్ర పోషించే వ్యక్తి గురువు. విద్యార్థులకు జ్ఞానం పంచి, మంచి పౌరులుగా తీర్చిదిద్దే గురువుల సేవలను స్మరించుకోవడానికి ఈ దినోత్సవం జరుపుకుంటాం. గురువు అనేది కేవలం పాఠ్యపుస్తక జ్ఞానమే కాకుండా, జీవిత పాఠాలు, విలువలు, నైతిక బోధనలు అందించే వ్యక్తి.**



మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నాం. 1962లో డాక్టర్ రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతిగా నియమించబడిన తర్వాత, ఆయన శిష్యులు, స్నేహితులు ఆయన జన్మదినాన్ని జరుపుకోవాలని కోరగా, ఆయన 'నా జన్మదినాన్ని పండుగగా కాకుండా, దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటే నా గౌరవం పెరుగుతుంది' అని చెప్పారు. అప్పటి నుండి ఈ రోజు దేశవ్యాప్తంగా గురువులను సత్కరించే, వారి సేవలను గుర్తించే వేడుకగా మారింది.

**పుస్తకాల్లో ఉన్న అక్షరాలకు ప్రాణం పోసి,**
**జీవితం అనే పాఠాన్ని నేర్పే మార్గదర్శి,**
**మన కలలకి రెక్కలు ఇస్తూ ఎగరనిస్తాడు,**
**మన భవిష్యత్‌ను కాంతులతో నింపుతాడు.**
**ఉపాధ్యాయుల కృషి సమాజానికి పునాది,**
**వారి త్యాగం మన విజయాల వెనుక నిధి.**

సమాజాన్ని మార్చేది కేవలం రాజకీయ నాయకులు లేదా రాజులు కాదు, గురువులు. ఒక మంచి ఉపాధ్యాయుడు తన విద్యార్థుల్లో జ్ఞానం, విలువలు, సామాజిక బాధ్యత నింపుతాడు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, లాంటి మహనీయులు తమ గురువుల బోధనల వల్లే సమాజానికి గొప్ప సేవ చేశారు. గురువు సమాజంలో అక్షరాస్యత, సంస్కృతి, శాస్త్ర విజ్ఞానం వ్యాప్తి చేస్తాడు.

ప్రస్తుతం సమాజం వేగంగా మారుతోంది. టెక్నాలజీ, సైన్స్, ఇంటర్నెట్ పెరుగుతున్న వేళ, గురువుల పాత్ర మరింత విస్తరించింది. గురువు ఇప్పుడు కేవలం పాఠాలు చెప్పేవాడు కాదు, విద్యార్థులకు జీవన నైపుణ్యాలు నేర్పేవాడు. మార్గదర్శకుడు, ప్రేరణదాత, స్నేహితుడు, సలహాదారుగా మారుతున్నాడు. సమాజంలో నైతిక విలువలు తగ్గుతున్న సందర్భంలో, వాటిని నిలబెట్టే బాధ్యత కూడా గురువులపైనే ఉంది.

**గూగుల్ కన్నా 'గురువే' గొప్ప..**

నేడు, ప్రపంచం శరవేగంగా దూసుకుపోతోంది, మనకు గూగుల్ అందుబాటులో ఉన్నా సరే మనకు గురువు అవసరం, గురువును గూగుల్ భర్తీ చేయలేదు. గురువు అనేది సమాజానికి అజరామరమైన శక్తి. ఆయన లేకపోతే సమాజం చీకటిలో మునిగిపోతుంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లుగా, 'నిజమైన గురువు అనేది కేవలం పాఠాలు చెప్పేవారు కాదు, ఆచరణలో చూపించి, విద్యార్థిని సత్పథంలో నడిపించేవాడు.' అందుకే ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం రోజున మన గురువుల పట్ల కృతజ్ఞతలు తెలియజేసి, వారి సేవలను గుర్తుంచుకోవాలి. గురువు గొప్పతనాన్ని మన హృదయాల్లో నిలుపుకోవాలి, నింపుకోవాలని తెలియజేస్తున్నాను. గురుదేవోభవ..

**ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు..**

### భావి భారత నిర్మాతలు ఉపాధ్యాయులు..

భారతీయ సమాజం జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత అక్షరాలుదిద్దించిన గురువుకే పెద్దపీట వేసింది. ప్రపంచమంతా ఒకే విధంగా గౌరవించే వృత్తి ఉపాధ్యాయ వృత్తి గురువును పూజించే విషయంలో దేశాలమధ్య తేడా ఉండొచ్చుగాని గౌరవించడం అనేది ప్రపంచమంతటా ఒకటే. ఉపాధ్యాయుడిని గౌరవించే రూపాలు ఆయా దేశాల్లోని సంప్రదాయాల మీద ఆధారపడి ఉంటుంది తప్ప గౌరవించడానికి కొలమానం మాత్రం కాదు. మనసులో గురువు పట్ల ఉండే గౌరవంలో మాత్రం ప్రపంచంలో ఎక్కడ చూచినా ఎటువంటి వ్యత్యాసం కనిపించదు. దీనికి కారణం ఒక వ్యక్తి అభివృద్ధిలో గురువుకు గల కీలకపాత్రపై మనకున్న అపారమైన నమ్మకం. మన గ్రంథాలు అయితే గురువుకిచ్చినంత ఉన్నత స్థానం ప్రపంచంలో ఏ గ్రంథాలు ఇవ్వలేదనే చెప్పాలి.

### గురువుల గొప్పతనం

- జ్ఞాన ప్రసాదకులు – చీకటిలో వెలుగు చూపించే వారు గురువులు.
- ప్రేరణ – ఒక గురువు చెప్పిన చిన్న మాట, విద్యార్థి జీవితాన్ని శాశ్వతంగా మార్చేస్తుంది.
- సమాజ నిర్మాణం – ఒక మంచి గురువు వందలాది విద్యార్థులను తీర్చిదిద్దుతాడు, వారు తిరిగి సమాజాన్ని తీర్చిదిద్దుతారు.
- నిస్వార్థ సేవ – గురువు ఫలితం కోసం కాదు, భవిష్యత్ కోసం పనిచేస్తాడు.
- గురువు విద్యార్థిపై చూపిన ప్రభావం జీవితాంతం మిగిలిపోతుంది.
- ఆ గురువు స్ఫూర్తిగా విద్యార్థి విజయాలను సాధిస్తాడు.
- చాలామంది జీవితంలో తిరుగుబాటు, ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం గురువుల వల్లే వస్తాయి.

# దారి చూపే దివిటీ.. గురువు

## గురుదేవోభవ!

■ సామాన్య ఉపాధ్యాయుడి ■ నుండి రాష్ట్రపతిగా రాధాక్రిష్ణన్ ■ భావి, భారత పౌరులను తీర్చిదిద్దే

■ కీలక బాధ్యత గురువులదే ■ భారతీయ సంస్కృతిలో గురు భావనకు విశిష్ట స్థానం

■ మారుతున్న కాలంలో మారిన గురుస్థానం ■ బోధనలో సరికొత్త పద్ధతులు.. సాంకేతికతకు ప్రాధాన్యత

■ యుగాలు మారినా.. గురువు స్థానం ఎప్పుడూ గొప్పదే


నవ నాగరిక సమాజంలో ఆయనో సాధారణ మనిషి అయినా.. ఆదిమయుగం నుంచి ఆధునిక శకం దాకా ఆయనే జీవన వికాస మార్గదర్శకుడు. సమాజ దేవాలయానికి సిసలైన పురోహితుడు గురువు. మాతృదేవోభవ , పితృదేవోభవ , ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. తల్లి , తండ్రి తరువాత స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. గురువు అనే పదానికి ప్రత్యేకమైన అర్థముంది. గు అంటే చీకటి. రు అంటే తొలగించు అని అర్థం. అజ్ఞానమనే చీకటిని తొలగిస్తాడు కాబట్టి గురువు అనే పేరు స్థిరపడిపోయింది. గు అంటే గుహ్యమైనది, తెలియనిది. రు అంటే దానిని రుచ్యము చేసేది. అంటే ఆ రహస్యమైన దానిని తెలియపరిచేది. ప్రేమ , ఆప్యా యతలకు చిహ్నంగా నిలిచే గురువు విద్యార్థుల కలలను నిజం చేసే ప్రత్యక్ష దైవం. భారతీయ సంప్రదాయంలో గురువుకు గల ప్రాధాన్యత గణనీయమైనది. గురువు సమక్షంలో నేర్చుకునే విద్య మనిషి జీవితానికి అర్థాన్ని , పరమార్థాన్ని చేకూరుస్తుందన్న భారతీయుల భావన.. యుగాలనాటి నుంచి గురుశిష్య బాంధవ్యాన్ని చిరంజీవిగా నిలుపుతున్నది. భారతీయ పురాణేతిహాసాలు సైతం పిల్లల భవితవ్యాన్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తరువాత గురువు ప్రధాన పాత్ర పోషిస్తారని తెలిపాయి. అందుకే అవి గురువుకు దైవత్వాన్ని ఆపాదించి పెట్టాయి. సమాజ నిర్మాణంలో కీలకపాత్ర వహించే ఉపాధ్యాయుడి పేరు మీద ఒక ప్రత్యేక రోజుని ఏర్పాటు చేసి ఆ వృత్తిని గౌరవిస్తుండడం మన సంస్కృతిలో నేడు అంతర్భాగమై పోయింది.ఇది ఎంతైనా గర్వించతగ్గ విషయం. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడం ద్వారా వారి సేవలను గౌరవించాలి. వారి ఆదర్శాలను అనుసరించాలి. విద్యార్థి సంఘానికి దేహం వంటివాడైతే ఉపాధ్యాయుడు ఆత్మ. అటువంటి ఉపాధ్యాయుడిని ప్రతి యేటా సత్కరించుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే కాదు , సమాజం మీద కూడ ఉంది. ఉపాధ్యాయవృత్తికి అపారమైన గౌరవాన్ని తెచ్చిపెట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి కాస్తంత తెలుసుకుందాం..!

**ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి..**

సర్వేపల్లి రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుత్తణిలో 1888వ సంవత్సరం సెప్టెంబర్ ఐదో తేదీన జన్మించారు. పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన విద్యాభ్యాసం అనేక ఒడిదుడుకుల మధ్య కొనసాగింది. తత్వశాస్త్రంపై మక్కువతో అదే ప్రధానాంశంగా ఎం.ఏ., విద్యాభ్యాసంలో థీసిస్‌గా ది ఎథిక్స్ ఆఫ్ వేదాంతను తన 20వ ఏటనే సమర్పించిన ప్రతిభాశాలి రాధాకృష్ణన్. అనంతరకాలంలో ఆయన అధ్యాపక వృత్తిలో కొనసాగుతూనే పలు మతాల తత్వసారాన్ని ఆకళింపు చేసుకున్నారు. రాధాకృష్ణన్ రచనల్లో ఒకటైన ఇండియన్ ఫిలాసఫీ భారతీయ తత్వశాస్త్ర వినీలాకాశంలో ధృవతారగా నిలిచిపోయింది. విదేశాలలో తాను చేసిన తత్వ శాస్త్ర సంబంధిత ప్రసంగాలలో భారతదేశానికి స్వాతంత్ర్యం రావల్సిన ఆవశ్యకతను ప్రస్తావించేవారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలను నిర్వహించిన రాధాకృష్ణన్... విద్యా రంగం లో పలు నిర్ణయాత్మక సంస్కరణలకు మార్గదర్శకుల య్యారు. తన అనిర్వచనీయ మైన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక భారత రత్న పురస్కారం ఆయనను వరించింది. 1962వ సంవత్సరంలో దేశంలో అత్యుత్తమైన రాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. పదవిలో ఉన్న ఐదు సంవత్సరాలలో తలెత్తిన సంక్షోభాలకు తనదైన శైలిలో పరిష్కారం చూపారు. ఇదే సందర్భంలో కొంతమంది శిష్యులు, మిత్రులు.. రాధాకృష్ణన్ పుట్టిన రోజును జరిపేందుకు ఆయన వద్దకు వచ్చారట. ఆయన తన పుట్టిన రోజును వేరుగా జరిపే బదులు, దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే తానెంతగానో గర్విస్తానని చెప్పారట. ఉపాధ్యాయ వృత్తిపై తన ప్రేమను చాటుకున్న రాధాకృష్ణన్ కోరిక మేరకే ఆనాటి నుంచి ఆయన పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా కమలాకర్

**జన్నారం, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**



జన్నారం మండలంలోని కిష్టాపూర్ జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. కమలాకర్ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ఆయనను అభినందించారు.



## ప్రశాంత వాతావరణంలో
# వినాయక నిమజ్జనం జరగాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**ముథోల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
భైంసా పట్టణంలో జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు అవసరమైన చర్యలు చేపట్టాయని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరగాలని ఆకాంక్షించారు. గడ్డెన్న వాగు పరిసరాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, భైంసా సబ్ కలెక్టర్లను సన్మానించారు. అనంతరం పట్టణంలోని పలు మండపాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు. అనంతరం తానూరు మండలం బోసి గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో జిల్లా కలెక్టర్, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించి వినాయకుని చిత్రపటాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఏఎస్పీ అవినాష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
మానవత్వం పరిమళించేలా ఓ అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు ఆదిలాబాద్ చెందిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 40 సంవత్సరాల ఓ మహిళ నాలుగు రోజుల క్రితం మృతి చెందడంతో స్థానిక రిమ్స్ శవాగారంలో ఉంచారు. బంధువులు ఎవరు రాకపోవడంతో వన్ టౌన్ ఎస్సై రమ్య మానవసేవే మాధవసేవ, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అనాథ శవానికి స్థానిక స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమ్య, మానవసేవే మాధవసేవ అధ్యక్షురాలు చౌహాన్ శశికళ, సభ్యులు నర్సింగ్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రంజిత్



**చెన్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
చెన్నూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా పట్టణానికి చెందిన కుదురుపాక రంజిత్ ను నియమిస్తూ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ, సోషల్ మీడియా యువజన కాంగ్రెస్ కోఆర్డినేటర్ గా నియమించినందుకు మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షురాలు సురేఖ ప్రేమ్‌సాగర్ రావు, పిసిసి సభ్యులు రమేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై జిల్లా కాంగ్రెస్ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, అంతేకాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# గణేష్ మండపంలో గోరింటాకు వేడుకలు

## సంబురంగా భక్తిగీతాల ఆలాపన

**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గణనాథుడికి పూజలతో వైవిధ్యమైన కార్యక్రమాలు.. భక్తిగీతాలతో సందడి చేస్తున్నారు స్థానిక మహిళలు. గుడిపేట్ 13 వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ముందు ఏర్పాటు చేసిన లక్ష్మీ గణేష్ మండలిలో గురువారం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం గోరింటాకు, గాజుల వేసుకోవడం కార్యక్రమం నిర్వహించారు. పూజ కార్యక్రమాల సందర్భంగా భక్తి గీతాలు ఆలాపించారు.



సెప్టెంబర్ 5 శుక్రవారం నిమజ్జనానానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడకలో కోలాట ఆటతో గణపతిని సాగనంపాలని.. అందుకు అవసరమైన పనుల్లో నిమగ్నం అయ్యామని నిర్వాహకులు తెలిపారు.



## అర్హులందరికీ
# ఇళ్లు అందేలా చర్యలు

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని పోతెపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గురువారం సుమారు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 17 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులను మొదలు పెట్టాలని ప్రభుత్వం నాలుగు విడుతలుగా లబ్ధిదారుల అకౌంట్లలో నిధులు జమ చేస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కమ్మర్‌గాం, మురళీగూడ, తదితర గిరిజన గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయని త్వరలోనే మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. వరదల నేపథ్యంలో దెబ్బతిన్న పంటల సర్వే నిర్వహిస్తున్నారని పంట నష్ట పోయిన ప్రతి ఒక్క రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. దశల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆల్బర్ట్, ఎస్సై అనిల్‌కుమార్, డీటీ చిన్ను, నాయకులు రాజేశ్వర్, మహేష్, సత్యనారాయణ, నాగేష్, గణపతి, నానయ్య, ప్రభాకర్, కాంతారావు, పురుషోత్తం, గోపాల్, దామోదర్, అంజన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మంచిర్యాల ఏసీపీ

### నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలి



**లక్సెట్టిపేట, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. గురువారం పట్టణంలోని గోదావరి నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణేష్ నవరాత్రుల అనంతరం మండపల నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జనం రోజు పూజ కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేసుకొని విగ్రహాలను శోభయాత్ర, నిమజ్జన ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని, సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాలలో అన్ని రకాల భద్రత, రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాలపై వెళ్లే వారిపై రంగులు చల్లకూడదని, విగ్రహాల ఎత్తును బట్టి నిర్దేశించిన స్థానాలకు విగ్రహాలను తీసుకు వెళ్లాలని, శోభాయాత్ర సమయాల్లో విద్యుత్ వైర్లతో జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలను గోదావరి, చెరువుల వద్దకు నిమర్జనానికి తీసుకెళ్లకూడదని నీటిలో నేరుగా ఎవరు దిగకూడదన్న విషయాలు మండపాల నిర్వాహకులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సిఐ రమణమూర్తి,ఎస్సై సురేష్, తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ ఉన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

# వేగవంతం చేయండి

**ఖానాపూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఖానాపూర్ ఎంపీడీవో సిహెచ్ రత్నాకర్ రావు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన తహసీల్దార్ సుజాత రెడ్డితో కలిసి మండలంలోని గోడల పంపు, కొత్తపేట్, బావాపూర్, గోసం పల్లి, గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీలు, పంచాయతీ కార్యదర్శి, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. నిర్మాణ దశలు పరిశీలించి లబ్ధిదారుల అకౌంట్‌లోకి డబ్బులు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలానికి మంజూరైన ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు.

## నూనె దీపాలతో గణపతి ఆకృతి



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని మహమ్మద్ ఖాసీం బస్తీలో ఏర్పాటుచేసిన గణేష్ మండలి వద్ద గురువారం రాత్రి మహిళలు దీపాలతో గణపతి రూపాన్ని తీర్చిదిద్ది తమ భక్తుని చాటుకున్నారు. తొమ్మిది రోజులపాటు గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు ప్రతి ఇంటి నుంచి వెలిగించి తీసుకువచ్చిన దీపాలతో గణపతి రూపాన్నిఅలంకరించారు. నూనె దీపాలతో రూపుదిద్దుకున్న గణపతి ఆకృతి పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది




**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయ వృత్తి మహెూన్నతమైనది.. అన్ని వృత్తుల కెల్లా ఉపాధ్యాయ వృత్తి మహెూన్నతమైనదని జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ అన్నారు. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవార్ పేట్ నిర్మల్ యందు ముందస్తుగా నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ... చీకటిలాంటి అజ్ఞానాన్ని గురువు తొలగించి వెలుతురు లాంటి జ్ఞానాన్ని అందిస్తాడని అన్నారు. గురువు నేర్పిన విద్యాబోధనల వల్లనే ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని దానికి ఉపాధ్యాయుడే మార్గదర్శకుడు అని అన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన విద్యారంగానికి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థినిలు ఉపాధ్యాయులను సన్మానించి పెన్నులను బహుకరించారు.

# వినాయక మండపాల్లో పూజలు చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశుని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం దర్శించుకున్నారు. గణేశుని వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ మండప నిర్వహకులు కలెక్టర్ ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ పట్టణంలో వినాయక శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. వినాయకుని నిమజ్జనం సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని అన్నారు. అనంతరం సమీపంలో గల రాధాకృష్ణ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తాసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంక్షేమంలో భాగంగా చేపట్టిన మధ్యాహ్న భోజనంలో నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువా రం సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత, హాజరు పట్టికను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన రుచికరమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజన మెనూ ద్వారా అందించడం జరుగుతుందని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం అంకుశాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి ఉపాధ్యా యులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు.



## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
గణేష్ నిమ జ్జనోత్సవానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నామని డీసీపీ భాస్క ర్ అన్నారు. గణేష్ నవరాత్రులు ముగించుకొని రామగుండం పో లీసు కమిషనరేట్ మంచిర్యాల జోన్‌లో వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు. నిమ జ్జనం కోసం తాండూర్, మంచిర్యాల, గోదావరిఖని బ్రిడ్జీ వద్ద నిమజ్జనం జరిగే శోభాయాత్ర రూటు మ్యాప్‌ను పరిశీలిం చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరు గకుండా పటిష్టమైన భద్రత, బందో బస్తు ఏర్పాటు చేశామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో వినాయక నిమజ్జనం శోభాయాత్ర బందోబస్తు కోసం ముగ్గురు ఏసీపీలు, 11మంది ఆర్ఐ లు, ఎస్ఐలు, 28 మంది ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు 175 మంది మొత్తం మంచిర్యాల జోన్ పరిధిలో 2334 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటార న్నారు. మంచిర్యాల జోన్‌లో ఎక్కువగా విగ్రహాలు రాయపట్నం బ్రిడ్జి గూడెం, గోదా వరి పుష్కరఘాట్ లక్షెట్టిపేట, మంచిర్యాల ప ట్టణం గౌతమేశ్వర ఆలయం టెంపులు కాలేజీరోడ్డు, సీతారాంపల్లి ఇన్‌టెక్‌వెల్, ఇం దారం బ్రిడ్జి, చెన్నూర్ పె ద్దచెరువు, బెల్లంపల్లి పెద్ద చెరువుల్లో నిమజ్జన కార్యక్ర మానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు, ఫ్లడ్‌లైట్లు, క్రేన్‌లు, ప్లాట్‌ఫాంలు, మంచినీటి వసతితో పాటు నిమ జ్జనం జరిగే ప్రాంతాల్లో గజఈతగాళ్లను ఉంచామన్నారు.



## ఘనంగా వినాయక నిమజ్జనం

**చెన్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
చెన్నూరు పట్టణం, మండలంలో గణేష్ నిమజ్జన ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. మంగళవాయిద్యాలు, మహిళల కోలాటం, యువతీయువకుల నృత్యాల న డుమ శోభాయాత్రను కన్నుల పండగగా నిర్వహించారు. గాంధీ చౌక్‌లో ఏర్పాటు చేసిన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథులకు ఘనంగా స్వాగతం పలి కారు. అనంతరం పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘట నలు జరగకుండా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వ ర్ ఆధ్వర్యంలో చెన్నూరు సీఐ దేవేంద ర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**దండేపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లోని గణనాథులను శోభాయాత్రగా తీసుకెళ్లి గూడెం, ద్వారక గోదావరి నదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. మహిళలు నృత్యాలు చేస్తూ అలరించారు.

**కోటపల్లి :** మండల కేంద్రంలో 9 రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను గురువారం గంగమ్మ ఒడికి నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ఉత్సవాలను అత్యం త వైభవంగా జరిపారు. ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరగకుండా పోలీసు లు బందోబస్తు నిర్వహించగా విగ్రహాలతో శోబాయాత్ర నిర్వహించి స్థానిక పెద్దచెరు వులో నిమజ్జనం చేశారు.



## జిల్లా కలెక్టర్‌ను

# కలిసిన సింగరేణి జీఎం

**మందమర్రి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ రాధాకృష్ణ గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కెకె ఓసి ఆర్అండ్ఆర్, భూసేకరణ సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు. అనంతరం జిల్లా అటవీ అధికారి శివ ఆశిష్ సింగ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ లోని ఆర్కే ఓసి ఫారెస్ట్ ల్యాండ్ డైవర్షన్ గురించి చర్చించారు. సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వైద్య శిబిరం

**మందమర్రి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని పాత బస్టాండ్ మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం పాఠశాలలో వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 51 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో 8 మందికి రక్త నమూనాలు ఆడికెట్టుల ద్వారా పరీక్షించగా ఎలాంటి మలేరియా, డెంగ్యూ పాజిటివ్ లు నిర్ధారణ కాలేదని, అదేవిధంగా 14 మందికి చర్మ సంబంధిత అలర్జీకి సంబంధించిన చికిత్సలు చేయడం జరిగిందని, ముగ్గురిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి పంపించి ఐవీ ఫ్లూట్ ద్వారా చికిత్స అందించడం జరిగిందని వైద్యులు తెలిపారు. పాఠశాలలో డ్రైడేతో పాటు కిచెన్‌ను పరిశీలించి, దోమల మందు పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆర్బిఎస్కె వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆ రెండు పార్టీలతో ప్రజలకు ఒరిగిందేమి లేదు

## ఎమ్మెల్యే పాయల్ సమక్షంలో పలువురు బీజేపీలో చేరిక



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
గతంలో పరిపాలించిన బీఆర్ఎస్, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. సాత్నాల మండలంలోని మాం గోర్ల, దేవిజి గూడకు సంబంధించిన కాం గ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువా రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ వల్ల నేడు గ్రామాలలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు రాక అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ, రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చిన భారతీయ జన తా పార్టీని గెలిపించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్, పోతరాజు రమేష్, సురేష్, రోహిదాస్, తదితరులు ఉన్నారు.



## పని భారాన్ని తగ్గించాలి


**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలకు పని భారాన్ని తగ్గించాలని ఎన్సీడీ ఆన్లైన్ సేవలను మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ వద్ద నిరసన తెలిపిన ఎనిమిలు నిరసన తెలిపిన ఆరోగ్య కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు తాము కష్టపడుతున్నప్పటికీ ప్రభుత్వం ఆన్లైన్ సేవలతో పని ఒత్తిడి చేస్తుందని దీనివల్ల మానసిక ఇబ్బందికి గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో సిసి వినయ్ అందించారు, ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో, ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలు, మిమ్స్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో గురువారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం ఉపాధ్యాయ పాత్ర పోషించిన వారిలో ఉత్తమంగా బోధించిన ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
లక్షెట్టిపేట పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు, గురువారం రాత్రి ఐదవ వార్డులో దోమల నివారణ మందును స్ప్రే చేశారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగే అవకాశం ఉందని, నీటి గుం తలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచిం చారు. మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
గంజాయి సరఫరా, సాగు కేసులో ముగ్గురు నిందితులకు ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ శిక్ష విధించారు. జాడి స్వీకర్, కుమ్రం సాయి కిషోర్‌లకు చెరో 5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10, 000 జరిమానా విధించగా, గంజాయి సాగు చేసిన ఆత్రం భీముకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10, 000 జరిమానా విధించారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు గురుబ్రహ్మ అవార్డు



**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముత్యం బుచన్నకి గురుబ్రహ్మ అవార్డు లభించింది. గణిత ఒలింపియాడ్‌లో చేసిన విశేష సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గణిత శాస్త్ర బోధనలో విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడంలో బుచ్చన్న చేసిన కృషి ఫలితమే ఈ అవార్డుకు కారణమని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, ఎంఈఓ మాలవీ దేవి అభినందించారు. ప్రన్సిపాల్ బుచ్చన్నకు అవార్డు రావడం పట్ల స్కూల్ అధ్యాపక బృందం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
దిలావర్‌పూర్ మండలం సాంగ్వీ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. దిలావర్ పూర్ మండల సాం గ్వి గ్రామం నుండి సోన్ మండలం సిద్ధలకుంట గ్రామం వరకు రూ.3 కోట్ల నిధులతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సాంగ్వి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నూతన హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ చేసారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్లు డ్రైనేజ్‌లు నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షులు వి సత్యనారాయ ణ గౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి, నాయకులు ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, అచ్యుత్ రావ్, వీరేష్, మండల అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు జమాల్, మల్లేష్,ముత్యం, అశ్వత్థామ, రాజేశ్వర్ పాల్గొన్నారు.





## విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు సమీక్షించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో దహెగాం, బెజ్జూరు, పెంచికలపేట, చింతలమానేపల్లి మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 గంటల లోపు మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల, విద్యార్థుల గైర్హాజరుపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించాలని తెలిపారు. 50 శాతం విద్యార్థులు గైర్హాజరు అవుతున్నారని ఇందుకు గల కారణాలను తెలుసుకొని సంబంధిత విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడాలని తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు కాకూడదని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన తాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలల సమన్వయ కర్త అబిద్ అలీ, విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు



**చెన్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే పోలీసులతో దాడి చేయించిన ఘటనతో రైతుల్లో మంత్రి గడ్డం వినోద్ వెంకట స్వామిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావ డం, మెదక్ జిల్లాకు ఇంఛార్జీ మంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన నాటి నుంచి నియోజక వర్గ ప్రజలను సరిగ్గా పట్టించుకోవడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు. మెదక్ జిల్లాపై చూపించిన శ్రద్ద మంత్రి పదవి రావడానికి కారణమైన నియోజన వర్గంపై చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎరువులను నియోజక వర్గానికి ఎక్కువగా మంత్రి తెప్పించారని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. లెక్కల్లో ఎరువులు తెప్పించినట్లు చూపిస్తున్న అధికారులు, అవి ఎవరికి చేరినాయో పరిశీలిస్తే దొంగలెవరో భయటకు వస్తుందని, ఇతర జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు ఎన్ని ఎరువుల బస్తాలు వెళ్లాయో బయటపడుతుందని రైతులు వాపోతున్నారు. ఎరువులు నియోజక వర్గానికి పంపించింది దళారుల కోసమేనా..? అనే ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం మంత్రి తీరును వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. యూరియా తెప్పించాలని నినదిస్తున్నరైతులపై, మద్దతు తెలుపుతున్న నాయకులపై పోలీసుల దాడి సంఘటన నియోజక వర్గం మొత్తం దావానంలా వ్యాపించడం, రైతుల కోసం, ప్రజల సమస్యలపై పోరాడుతున్న పార్టీలకు ఈ అంశాలు లాభం చేకూరేలా కనిపిస్తున్నాయి.




## ఓటీటీలోకి సూపర్ స్టార్ 'కూలీ'..

రజనీకాంత్ యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో గతనెల 14న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్డ్ టాక్ సొంతం చేసుకుంది. రజనీకాంత్ స్క్రీన్ ప్రజెన్స్ తప్పా సినిమా కథ, కథనం బలంగా లేదని విమర్శలు వచ్చాయి. విక్రమ్, ఖైదీ, మాస్టర్ సినిమాల్లో కనిపించిన లోకేష్ మార్క్ 'కూలీ' కనిపించలేదని ప్రేక్షకులు అభిప్రాయపడ్డారు. కథ పరంగా మెప్పించనప్పటికీ.. రజనీకాంత్, నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర వంటి స్టార్ హీరోల ఇమేజ్ తో కమర్షియల్ గా బాగానే సక్సెస్ అయ్యింది ఈ సినిమా. ప్రపంచవ్యాప్తంగా రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. సక్సెస్ ఫుల్ థియేట్రికల్ రన్ తర్వాత ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రియులను అలరించేందుకు వచ్చేస్తోంది. సెప్టెంబర్ 11 నుంచి 'కూలీ' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అమెజాన్ ఎక్స్ వేదికగా పోస్టర్ రిలీజ్ చేసింది.



## వెంకీకి గర్ల్‌ఫ్రెండ్ ను సెట్ చేస్తున్నారా?

టాలీవుడ్ లో ఫ్యామిలీ హీరో అనగానే వెంటనే గుర్తొచ్చే పేరు విక్టరీ వెంకటేష్. దగ్గుబాటి రామానాయుడు వారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన వెంకీ మొదటి నుంచే ఫ్యామిలీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ ఫ్యామిలీ హీరోగా గుర్తింపు పొందారు. చిరూ, బాలయ్య, నాగ్ తో పోటీ పడుతూ ఇప్పటికీ సీనియర్ హీరోల్లో ఒకరిగా కంటిన్యూ అవుతున్న వెంకీకి మధ్యలో కొంత కాలం వరుస ఫ్లాపులు ఇబ్బంది పెట్టాయి.కానీ ఈ ఇయర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో రూ.300 కోట్లు కలెక్ట్ చేసి సీనియర్ హీరోల్లో ఆ రికార్డు సాధించిన ఏకైక హీరోగా నిలిచారు వెంకీ. సంక్రాంతికి వస్తున్నాం సినిమా వెంకీ కెరీర్ ను ఒక్కసారిగా మార్చేసింది. ఆ సినిమా తర్వాత ఆయనతో సినిమాలు చేయడానికి డైరెక్టర్లు ఎగబడుతున్నారు. అయితే ఆఫర్లు వస్తున్నా తొందరపడకుండా వెంకీ తర్వాతి సినిమాల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.అందులో భాగంగానే తన నెక్స్ట్ మూవీని మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తో అనౌన్స్ చేసి ఫ్యాన్స్ కు మంచి ఆనందాన్నిచ్చారు. గతంలో త్రివిక్రమ్ రైటర్ గా ఉన్నప్పుడు వీరిద్దరూ కలిసి వర్క్ చేసి మంచి హిట్స్ ను అందుకున్నారు. కానీ త్రివిక్రమ్ డైరెక్టర్ అయ్యాక వీరిద్దరి కాంబోలో ఇప్పటివరకు సినిమా రాలేదు. వీరి కలయికలో ఎప్పుడెప్పుడు సినిమా వస్తుందోనని వెయిట్ చేసిన ఫ్యాన్స్ ఆశ ఇప్పుడు తీరబోతుంది. త్రివిక్రమ్ ఈ సినిమాను తన మార్క్ టేకింగ్ తో, వెంకీ కామెడీ టైమింగ్ కు తగ్గట్టు తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. అయితే సినిమా అనౌన్స్ అయింది కానీ అందులో వెంకీ సరసన హీరోయిన్ గా ఎవరు నటిస్తున్నారనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలోనే ఈ మూవీలో హీరోయిన్ గురించి రోజుకో పేరు వినిపిస్తోంది. ఈ సినిమాలో ముందు రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుందని వార్తలొచ్చాయి.కానీ ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకీ గర్ల్‌ఫ్రెండ్ గా నటించిన మీనాక్షి చౌదరిని ఫైనల్ చేశారని టాక్ వినిపిస్తుంది. అయితే ఈ సినిమా కోసం శ్రద్ధా శ్రీనాథ్, నేహా శెట్టి, శ్రీనిధి శెట్టి పేర్లను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నారని రూమర్లు వినిపిస్తున్నాయి. ఏదేమైనా హీరోయిన్ విషయంలో మేకర్స్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు ఏ విషయాన్ని నమ్మలేం. కాగా ఈసినిమాకు వెంకటరమణ కేరాఫ్ ఆనంద నిలయం, అలివేలు వెంకటరత్నం అనే టైటిల్స్ ను మేకర్స్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. సెప్టెంబర్ నెలాఖరు నుంచి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది.



## మీనాక్షికి బంపర్ ఆఫర్!

టాలీవుడ్ కి ఉవ్వెత్తున దూసుకొచ్చిన మీనాక్షి చౌదరి స్పీడ్ ఒక్కసారిగా స్లో అయింది. `లక్కీ భాస్కర్`, `సంక్రాంతికి వస్తున్నాం` లాంటి బ్లాక్ బస్టర్లున్నా? 2025 లో మాత్రం ఒక్క అవకాశం కూడా అందుకోలేకపోయింది. దీంతో మీనాక్షి స్లో అయిందనే వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ట్యాలెంటెడ్ బ్యూటీకి అవకాశాలు రాకపోవడం ఏంటనే చర్చ షురూ అయింది. `అనగనగా ఒక రోజు` అనే సినిమా చేస్తున్నా? ఆ చిత్రం గురించి ఎలాంటి అప్ డేట్ కూడా లేకపోవడంతో మీనాక్షి పేరు ఎక్కడా వినిపించని పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని నెలలు ఇదే కొనసాగితే మీనాక్షి ఔట్ డేట్ అయిపోతుందా? అన్న సందేహం రాకమానదు. సరిగ్గా ఇదే సమయంలో మీనాక్షి చౌదరికి బంపర్ ఆఫర్ వరించింది. టాలీవుడ్ లో స్పీడ్ తగ్గినా బాలీవుడ్ ఉందం టూ సరైన సమయంలో బిగ్ ఛాన్స్ అందుకుంది. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ `ఫోర్స్` నుంచి థర్డ్ ఇన్ స్టాల్ మెంట్ కు రంగం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. జాన్ అబ్రహాం హీరోగా ఈ సినిమా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో హీరోయిన్ గా మీనాక్షీ చౌదరిని ఎంపిక చేసారు. ఇప్పటికే టీమ్ మీనాక్షి తో చర్చలు జరపడం కథ నచ్చడంతో అమ్మడు అంగీకరించడం జరిగిపోయింది. దీంతో మీనాక్షి ఆనందానికి అవధుల్లేవ్. ఇంత వరకూ సొగసరి బాలీవుడ్ లో హీరోయిన్ గా లాంచ్ అవ్వ లేదు. టాలీవుడ్ టార్గెట్ గానే సినిమాలు చేసుకుంటూ వచ్చింది. బిజీ అయ్యేంతగా అవకాశాలు వస్తే హిందీని కాదని ఇక్కడే పని చేసేది. కానీ ఛాన్సులు రాకపోవడం మీనాక్షి కొత్త ప్రయత్నాలు చేసి బాలీవుడ్ పై దృష్టి పెట్టినట్లు తాజా కమిట్ మెంట్ ని బట్టి తెలుస్తోంది. అయితే హిందీ పరిశ్రమకు అమ్మడికి కొత్తేం కాదు. కెరీర్ ఆరంభంలో `అప్ స్టర్స్` అనే చిత్రంలో అన్ క్రెడిట్ రోల్ చేసింది. ఆ సినిమా గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. అందులో మీనాక్షి వీరూస్ గాళ్ ఫ్రెండ్ పాత్ర పోషించింది. కానీ ఆ తర్వాత హిందీ పరిశ్రమను అంత సీరియగా తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించలేదు. అనంతరం రెండేళ్ల పాటు ఖాళీగానే ఉంది. అటుపై సుశాంత్ హీరోగా నటించిన `ఇచట వాహనములు నిలుపరాదు` చిత్రంలో అవకాశం అందుకుంది. ఆ సినిమా విజయంతో మీనాక్షికి మంచి పేరొచ్చింది. ఆ సినిమా రిలీజ్ కు ముందు త్రివిక్రమ్ ఆమె ప్రతిభను గుర్తించి మంచి నటిగా ఎదుగుతుందని ప్రోత్సహించిన సంగతి తెలిసిందే.



## చిట్టీ హాట్ షో..

బ్లాక్ వన్ పీస్ లో ఫరియా హాట్ షో నెట్టింట వైరల్ అవుతోంది. క్లీవేజ్ షో చేస్తూ ఫొటోలకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ పిక్స్‌పై మీరూ ఓ లుక్కేయండి. 'జాతి రత్నాలు' సినిమాలో చిట్టీ పాత్రలో యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ తెచ్చుకుంది ఈ ఆరడుగుల సుందరి ఫరియా. ఈ సినిమా తర్వాత ఫరియాకు పెద్ద సక్సెస్ లేకపోయిన ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. సినిమాలు కాకపోతే టీవీ షోలు లేదంటే స్పెషల్ సాంగ్స్ ఇలా ఏదో ఒక విధంగా అభిమానులను అలరిస్తోంది ఈ ముద్దుగుమ్మ. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా బ్లాక్ వన్ పీస్ లో ఈ బ్యూటీ హాట్ షో నెట్టింట వైరల్ అవుతోంది. క్లీవేజ్ షో చేస్తూ ఫొటోలకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు షేర్ చేసిన క్షణాల్లోనే వైరల్ గా మారాయి. సెలబ్రిటీలు, నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. రాజశేఖర్ కుమార్తె శివాత్మిక రాజశేఖర్ ఫరియా ఫొటోలకు ఫైర్ ఇమోజీ రిప్లై ఇచ్చింది. మిగతా చాలా మంది నెటిజన్లు కూడా వావ్, సూపర్, స్టన్నింగ్ అంటూ ఫైర్ ఇమోజీస్ పెడుతున్నారు. ఫరియా రీసెంట్ గా 'మత్తు వదలరా 2' సినిమాలో మెరిసింది. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి విజయం సాధించింది. ప్రస్తుతం అల్లరి నరేష్ సినిమాలో నటిస్తోంది.

# ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

- ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ రాజర్షి షా
- తల్లిదండ్రుల తర్వాత గురువులకే ప్రాధాన్యత
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్









**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** ఉపాధ్యాయ దినోత్సవంను జిల్లాలో ఒకరోజు ముందుగానే నిర్వహించారు. సెప్టెంబర్ 5న నిర్వహించే డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవ గురుపూజో త్సవం, ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్స వం కార్యక్రమం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంచార్జ్ జిల్లా విద్యా శాఖాధికారి ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ముందుగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, నిస్వార్థ కృషిని గుర్తించి, వారిని గౌరవించడమే ఈ టీచర్స్ డే ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యఫలం ఉంటేనే ఉపాధ్యాయులుగా వస్తారని, ఉపాధ్యాయ దినో త్సవానికి ఉన్న ప్రాముఖ్యత మరేదానితో పోల్చడానికి లేదన్నారు. సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువులకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, ట్రైనీ కలెక్టర్ సలోని, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ల సమావేశంలో పాల్గొన్న కుడ్మేత విశ్వనాథ్ రావ్





**జైనూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్ల కార్యవర్గ సమావేశంలో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వ దృష్టికి తీసుకోపోవాలని చైర్మన్ల రాష్ట్ర కార్యవర్గనికి సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేకకుండ అనేక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాలకు సంబంధించి ఒకరే కార్యదర్శి మరియు ఐదు జిల్లాలకు ఒకరే మార్కెట్ ఇంజనీర్లు ఉండడం వల్ల అనేక పనులు పూర్తి కావడం లేదని తెలియజేశారు, మరియు ఆసిఫాబాద్ జిల్లాలో జరుగుతున రాజకీయ సమీకరణలు గురించి అదేవిధంగా ప్రోటోకాల్ మీద జరుగుతున్న విషయాలను గుర్తుచేశారు, స్థానిక ఎలక్షన్లో సైనికులుగా పని చేయాలని మాట్లాడతు రైతులకు సమస్యలు రాకుండా ముందుకు సాగాలని రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్ల కార్యవర్గానికి తెలియజేశారు, వారి వెంట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్లు మరియు తెలంగాణ రాష్ట్రములో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్లు పాల్గొన్నారు.



## వినాయక పూజలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ దంపతులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** గణేశ్ నవరాత్రులు సందర్భంగా గురువారం రెవెన్యు గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండల్‌లో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా దంపతులు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, రెవెన్యు సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.జె.సంగీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టు లో కనీసం 55% మార్కులు కలిగి ఉండాలన్నారు . ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీ హెచ్ డి కలిగిన వారికి, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 6వ తేదీ, శనివారంలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించి, 8వ తేదీ జరిగే డెమోకు హాజరు కావాలన్నారు.

# కుమార్తెను అపహరించిన తండ్రి

**నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

కుటుంబకలహాలతో ఆగ్రహం, పైపెచ్చు మద్యం మత్తు.. ఇలాంటి పరిస్థితిలో సొంత కుమార్తెనే అపహరించాడా తండ్రి. నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, బాలిక తల్లి కథనం ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన అంజయ్యకు మణితో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికో కుమార్తె జన్మించింది. కొంతకాలం తర్వాత మనస్పర్థలు వచ్చి వీరిద్దరూ దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం మణి నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్లో నివసిస్తుండగా, భర్త భైంసాలో ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అయిదేళ్ల కుమార్తె కీర్తనను మద్యం మత్తులో ఉన్న అంజయ్య అపహరించాడు. దీంతో బాలిక తల్లి, ఇతర కుటుంబసభ్యులు పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. మణి మాట్లాడుతూ.. కుమార్తె జన్మించిన తర్వాత భర్త తనను కొట్టేవాడని, ఈ కారణంగానే తాము దూరంగా ఉంటున్నామని చెప్పారు. తమకు విడాకులు ఇప్పించాలని దాదాపు 6 నెలల నుంచి పోలీసులను ఆశ్రయిస్తున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. కాగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు సీఐ వివరించారు. విడాకుల విషయం న్యాయస్థానానికి సంబంధించిన అంశమని, తమ పరిధిలో ఉండదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా రాత్రి అంజయ్య సురక్షితంగా పాపను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం బాటిళ్ల స్వాధీనం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లాలోని పలు బెల్టు షాపుపై పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. గురువారం ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు వివిధ బెల్టు షాపుల్లో 92 మద్యం బాటిల్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో ఠాకూర్ కార్తీక్ సింగ్ వద్ద 35 బాటిళ్లు, బాలాజీ నగర్ లో సాయికుమార్ వద్ద 14 బాటిళ్లు, కే.ఆర్.కే కాలనీలో లక్ష్మీ వద్ద 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



# పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు

**బోథ్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**

రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలను చేతికొచ్చే సమయానికి అడవి పందులు గుంపులు గుంపులుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తూ తినేస్తుండడంతో రైతులు నష్టం భరించలేక వ్యవసాయం అంటేనే భయపడే పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోతున్నారు. బోథ్ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సోలంకి రమేష్‌కు చెందిన ఎకరం నర వ్యవసాయ భూమిలో మక్క పంట వేశాడు. అడవి పందులు మక్క పంటను ధ్వంసం చేయడంతో ఆ రైతు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దీనస్థితిలో ఉన్నానని వాపోయాడు. పంటలకు రక్షణగా చీరలు, సోలార్ పరికరాలతో పంట చుట్టూ జీవా వైరు అమర్చినా అడవి పందుల బెడద వల్ల తమ పంటలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి అడవి పందుల బారి నుండి తమ పంటలకు రక్షణ కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



# సింగరేణి ఓసీలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్




బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. గురువారం ముంబాయిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సంస్థ చైర్మన్ %డ% ఎండీ ఎన్.బలరామ్ ఈ అవార్డులను అందుకున్నారు. ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో రామగుండం-3 ఏరియాకి చెందిన ఆర్ జీఓసీ-1 ఎక్స్ టెన్షన్, ఇల్లందు ఏరియాకి చెందిన జే కే-5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్కే-6 గని , ఆర్కే న్యూటెక్ గనులు ఉన్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్ ను ఇస్తూ అత్యుత్తమ స్టార్ రేటు సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను అందిస్తూ ఉంటారు. ఈ ప్రక్రియను స్టార్ రేటింగ్ అంటారు. ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, అక్కడ గల సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోనికి తీసుకుని మార్కులను కేటాయించడం జరుగుతుంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో పై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుండి వచ్చిన పరిశీలక బృందం వారు ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతారు. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుండి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధంగా సింగరేణి సంస్థలో ఈసారి నాలుగు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం అభినంద నీయం. ఈ గనుల నిర్వహణ, పర్యావరణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉత్పత్తి సాంకేతికత వంటి అంశాలలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే ఈ అవార్డులు సాధించుకోవడం జరిగింది. దీనిపై ఛైర్మన్ ఎండీ బలరామ్ తన హర్షం ప్రకటిస్తూ గనుల యాజమాన్యాలకు, కార్మికులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది గతంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగు గనులకు 5 స్టార్ రేటింగ్ లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇవే కాకుండా 14 గనులు 100 కు 80 నుండి 90 మార్కులు సాధించి 4 స్టార్ రేటింగు ను అందుకోవటం విశేషం. 20 గనులకు 3 స్టార్ రేటింగ్ లభించడం విశేషం. గతంలో కొన్ని గనులకు 2 స్టార్ రేటింగ్లు కూడా లభించగా.. ఈ సారి అన్ని గనులు కూడా తమ పనితీరును మెరుగుపరచుకుని 3 స్టార్ రేటింగ్ సాధించడం విశేషం.



### నిమజ్జన శోభాయాత్రలో

## కొండచిలువ కలకలం

నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
నిర్మల్ మండలం వెంగ్వా పేటలో గురువారం రాత్రి వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. యువకులు నృత్యాలు చేస్తూ ముందుకు వెళ్తుండగా, కొండచిలువ అడ్డు రావడంతో భయాందోళనకు గురై పరుగులు తీశారు. రాంనగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్, శేఖ్ ఇస్మాయిల్‌లు చాకచక్యంగా కొండ చిలువను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలారు.

## పేద ప్రజల అభ్యున్నతికి మోదీ సర్కార్ కృషి

నిర్మల్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
దేశంలో పేద ప్రజల అభ్యున్నతి కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సామాన్య మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణం పరిగణం తీసుకొని కేంద్ర క్యాబినెట్ జీఎస్టీ పై 12 శాతం ఉన్న పనులను ఐదు శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. పన్నుల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు. సెప్టెంబర్ 15 నుంచి జీఎస్టీ కొత్త విధానం అమల వుతుందని దీని దేశ ప్రజలు అర్థిస్తున్నారు.

### గంగారం మత్తడి వాగుపై

## రూ.3.15 కోట్లతో వంతెన నిర్మాణం

### వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు పట్ల గ్రామస్తుల హర్షం

నెన్నెల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
నెన్నెల మండలం గంగారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జాడి రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, గంగారం పెద్ద చెరువు మత్తడి వాగుపై 3 కోట్ల 15 లక్షల ఐటిడిఎ నిధులతో వంతెన మంజూరు అయింది. దీనివల్ల గంగారం, చిన్నవెంకటపూర్, కొత్తూరు గ్రామ ప్రజల ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది మరియు రైతులకు మేలు జరుగుతుంది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారం, రాజ్ కుమార్ కృషి ఫలితంగా వంతెన మంజూరు కావడం పట్ల సంబంధిత గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వాగులో చిక్కుకున్న ముగ్గురిని రక్షించి.. ప్రవాహంలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి



నార్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
వాగును దాటుతూ వరదలో చిక్కుకుపోయిన ముగ్గురిని కాపాడి వరద ప్రవాహంలో కొట్టుకుపోయి గ్రామస్థుడు మృతి చెందిన ఘటనతో గ్రామంలో విషాదం నెలకొని ఉంది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మల్లంగి గ్రామంలో జరిగిన ఘటన వివరాలను పోలీసులు, స్థానికులు వెల్లడించారు. గ్రామానికి చెందిన జాదవ్ కృష్ణ, జాదవ్ మిథున్, జాదవ్ మిట్టు వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా సమీపంలోని పెద్ద వాగు దాటే క్రమంలో వాగులో చిక్కుకున్నారు. దూరం నుంచి గమనించిన అదే గ్రామానికి చెందిన జాడే శంకర్ వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగా ఒక్కసారిగా వచ్చిన ప్రవాహంతో ఆయన అందులో కొట్టుకుపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జాడి రాజాలింగం, నార్నూర్ ఎస్సై అఖిల్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకుని పంచనామా చేశారు. గాలింపు చర్యల అనంతరం లభ్యమైన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.



### విద్యార్థులకు మెనూ ప్రకారం

## పౌష్టికాహారం అందించాలి

### జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ అన్నారు. గురువారం తిర్యాణి మండలంలోని దంతన్ పల్లి, బుగ్గ గూడ, గిన్నెధరి బాలికల ఆశ్రమ పాఠశాలలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్లేష్ తో కలిసి సందర్శించి పాఠశాలల పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. అనంతరం గిన్నెధరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, జ్వర బాధితుల వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జ్వర కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పంచాయితీ, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది సమన్వయంతో ఇంటింటి జ్వర సర్వే చేసి సత్వర వైద్య సేవలు అందించాలని తెలిపారు. చింతపల్లి గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారిని, వైద్య సహాయం పొందుతున్న బాలికలను కలిసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు గంటలపాటు చీకట్లో రోగులు..

ఉట్నూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని సామాజిక దవాఖానలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం కలిగింది. గణేశ్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేస్తుండడంతో దాదాపు ఐదు గంటలపాటు విద్యుత్‌ను నిలిపివేశారు. దీంతో దవాఖాన అంధకారంగా మారడంతో రోగులు అవస్థలు పడ్డారు. లక్షలు వెచ్చించి జనరేటర్ కొనుగోలు చేసినా.. దానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. జనరేటర్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.



# విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహ ఏర్పాటు కొరకు మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఎస్.టి. సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జనానికి పెద్ద చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. వినాయక శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం ప్రాంతంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.





తాండూర్ మండల కేంద్రంలోని ఐ.బి. ప్రాంతంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ మండలిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిమజ్జన ప్రాంతంలో లైట్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండళ్ల రిజిస్ట్రేషన్ అయిన ప్రకారం ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులకు తావు లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. మండళ్ల నిర్వాహకులు మార్గదర్శకాలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గుండాలకు బిటీ రోడ్డు మంజూరు

**దండేపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** దండేపల్లి మండల కేంద్రం నుండి గుండాల గిరిజన గ్రామం వరకు రూ.25 కోట్లతో బిటి రోడ్డు మంజూరైనట్లు తెలంగాణ గిరిజన ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి తెలిపారు. దండేపల్లి నుండి గుండాల వరకు 12కిలో మీటర్ల మేర రోడ్డు లేక గిరిజనులు అవస్థలు పడుతుండటంతో తాను ఉన్నతాధికారులను తీసుక వెళ్ళి పరిస్థితి వివరించడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేం సాగర్ రావు,ఇంచార్జీ మంత్రి దనసరి సీతక్కల చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని ఈ మేరకు వారిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు అప్పటి మంత్రి సీతక్కను కలిసి మంజూరు పత్రాలు అందించినట్లు తెలిపారు. బీటీ రోడ్డు మంజూరుకు ప్రత్యేక చొరవచూపిన గిరిజన ఆర్థిక చైర్మన్ కోట్నాక తిరుపతికి పలువురు అభినందనలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీగా చర్యలు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గణేష్ నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగును సందర్శించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు జిల్లా వ్యాప్తంగా 600 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు శోభాయాత్ర నిర్వహించే సమయంలో విద్యుత్ తీగ పట్ల అప్రమత్తంగా ఉండాలని,



మద్యం సేవించి సంస్కృతి సంప్రదాయాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు.

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం



**తాండూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం ఎంతవరకు సమంజసమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ ఈసా ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచి రాష్ట్రానికి అవసరమైన యూరియా కోటాను సరఫరా చేయకుండా కేంద్రం తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. యూరియా సరఫరాపై రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పలుమార్లు కేంద్రానికి నివేదించినప్పటికీ పట్టింపు లేకుండా వ్యవహరించడం రైతులపై వారికున్న చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. బీజేపీ నాయకులు వారి ఉనికిని కాపాడుకోవడానికి ధర్నాలు, రాస్తారోకోలు నిరసనలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రావు, గట్టు మురళి, సిరంగి శంకర్, సాలిగామ బాణయ్య పాల్గొన్నారు.





## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**దండేపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** దండేపల్లి మండలం వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. అనంతరం ఉపాధ్యాయులందరికీ విద్యార్థులు శాలువాలతో సత్కరించారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయలక్ష్మి మాట్లాడుతూ రాధాకృష్ణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఇప్పటినుండి కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహా గురువు సర్వేపల్లి



**ఖానాపూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** మహా గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆలోచనలు, బోధనలు అనుసరణీయమని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ పడాల ప్రభాకర్ అన్నారు. గురువారం ఖానాపూర్ లో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

# పంచాయతీ భవనానికి శంకుస్థాపన

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల అంచనాలతో మంజూరైన ఈ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, భాజపా మండల అధ్యక్షులు రాజేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఘనపురం నాగేష్, మాజీ ఎంపిటిసి అన్నం గణపతి, మధుకర్, వెంకన్న, నానయ్య, ప్రభాకర్, అనంత్ రావు, శంకర్, శ్రీనివాస్, నారాయణ, మహేష్, కాంతారావు, పురుషోత్తం, గోపాల్, దామోదర్, అంజన్న, రామయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.



## అనుమతిలేని చోట నిమజ్జనం చేయవద్దు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు గురువారం మాట్లాడుతూ, వినాయక నిమజ్జనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే చేయాలని, అనుమతులు లేని ప్రదేశాల్లో చేయరాదని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ఊరేగింపు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలని ఆయన సూచనలు చేశారు. వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదని, డీజేలకు అనుమతి లేదన్నారు.



# వాగులపై ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు

**మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగు పర్చేందుకు ప్రతిపాదనలు**

**అధికారులతో కలిసి సాధ్య సాధ్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్**



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
వర్షాకాలం వస్తే వాగులు, వంకలు పొంగి మారుమూల అటవీ గ్రామాలకు బాహ్య ప్రపంచం తో సంబంధాలు తెగిపోతున్నాయి. అసలే రోడ్డు సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజలు వాగులు పొంగడంతో నెలల పాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులు పొంగడం తో అత్యవసర సమయాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణీ స్త్రీలు ఆస్పత్రులకు వెళ్లేందుకు సహసమే చేయాల్సి వస్తుంది. టైగర్ జోన్ కావడం తో రోడ్లు, వంతెనలు నిర్మిచేందుకు అటవీ అనుమతులు పొందడంగగనమై పోయింది. వాగుల పై వంతెనలు నిర్మించడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్న అటవీ శాఖ ససేమిరా అంటుండం తో దశబ్దాలుగా అడవులే ఆటపట్టుగా మనుగడ సాగిస్తున్న అడవి బిడ్డల బతుకులు దుర్భరమైపోతున్నాయి. ఈ సమస్యలు పరిష్కరించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ప్రత్యేక దృష్టి సారించారు. వాగుల పై ఐరన్ బ్రిడ్జిలు నిర్మించే ఆలోచన చేసారు. ఆలోచన వచ్చిందే తడవుగా గురువారం అధికారులను వెంటబెట్టుకొని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి మారుమూల గ్రామాల్లో పర్యటించారు.ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని తీర్యాని మండలం గడెలపల్లి గ్రామపంచాయితీ లోని అటవీ ప్రాంతంలో వాగు మీద నిర్మించిన ఐరన్ బ్రిడ్జిని పరిశీలించారు. ఆలాంటి బ్రిడ్జి లను ఖానాపూర్ నియోజకవర్గం లోని మారుమూల ప్రాంతాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పెంబి మండలం అటవీ ప్రాంతాల్లో గుమ్మన, ఎంగ్లాపూర్,రాంనగర్ యాపాలగూడ, ఉట్నూర్ మండలం నర్సాపూర్ జే,వంకతుమ్మ గ్రామాల ప్రజలు రోడ్లు వంతెనలు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇక్కడి వాగులపై ఐరన్ బ్రిడ్జి లు నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.



# వైద్య సిబ్బందికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్

**డీఎం అండ్ హెచ్ఓ డా.అనిత**

**మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా వైద్య సిబ్బందికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత తెలిపారు. గురు వా రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడారు. సుమా రు 1590 వ్యాక్సిన్‌లు జిల్లాలోని మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్సీలు), మాతా శిశు సంరక్షణ (ఎంసీహెచ్), జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్)లో పనిచేస్తున్న వైద్యులకు, ఆరోగ్య సిబ్బందికి, హెల్త్ కేర్ వర్కర్స్ అందరికీ ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేసి, ఈ నెల 8న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వ పరంగా మొట్ట మొదటి సారిగా ఆరోగ్య సిబ్బందికి ఈ వ్యాక్సినేషన్ ఇస్తున్నామన్నారు. ఈ సమీక్షలో ఆర్ఎంవోలు శ్రీమన్నారాయణ, శ్రీధర్, డి సి హెచ్ కోటేశ్వరరావు, నోడల్




ఆఫీసర్‌లు సుగుణాకర్ రావు, సుధాకర్ నాయక్, ఇన్చార్జి డిపిసి మధు, ప్రశాంతి, డిపిఓ ప్రవళిక, భాగ్య, బీడీఏంలు సదన్, భారతి, సూపర్ వైజర్‌లు సుగుణాకర్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, వ్యాక్సిన్ మేనేజర్, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



# అడెల్లి ఆలయ ప్రారంభోత్సవానికి రండి

**సారంగాపూర్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ గురువారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఆలయపున నిర్మాణం జరగడంతో ఈ నెలలో ఆలయ ప్రారంభోత్సవం జరుగుతుందని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, దశరథం, పార్టీ నాయకులు ఉన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# బడికి వెళ్లాలంటే వాగు దాటించాల్సిందే..!

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వానాకాలం వస్తే.. గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు వర్ణనాతీతం మారాయని చెప్పుకోవచ్చు. కెరమెరి మండలంలోని బాబేఝురి గ్రామ పంచాయతీ పరిధిలోని గోండు గూడ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం స్కూల్ కు వెళ్తున్న పిల్లలను తల్లిదండ్రులు మోకాళ్ల పైగా నీటి ప్రవాహంలో వాగు దాటిస్తున్న ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక భారీ వరదలు వస్తే అంతే సంగతులు.. ఇటూ స్కూల్ కి.. అటు ఇంటికి వెళ్లని పరిస్థితి ఉంటుంది. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని గ్రామస్తులు చెబుతున్నారు.

